ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 02 సంచిక : 52 | గురువారం 20-02-2025 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..

# వందశాతం మళ్లీ మనదే అధికారం

**- అన్నిరంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం - కాంగ్రెస్ వ్యతిరేకతను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**- పార్టీ సభ్యత్వ నమోదు, ప్లీనరీపై చర్చ - బిఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో కెసిఆర్**



**హైదరాబాద్,ఫిబ్రవరి19:** తెలంగాణలో మళ్లీ వందశాతం అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ధీమా వ్యక్తం చేశారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఇక దృష్టి పెడతానని కేసీఆర్ అన్నారు. బుధవారం ఉదయం బిఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కెసిఆర్ మాట్లాడుతూ .. ఏప్రిల్ 10 నుంచి 27 వరకు పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని ప్రకటించారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అక్టోబర్, నవంబర్‌లో పార్టీ అధ్యక్ష ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగింది. భేటీలో బీఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ వేడుకలపై కార్యక్రమాల నిర్వహణపై, సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరి అంశాలపై నేతలతో కేసీఆర్ చర్చించి.. శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావం మొదలు ఇప్పటి వరకు సుదీర్ఘ ప్రస్థానాన్ని పార్టీ నేతలకు గుర్తు చేశారు. ఉద్యమం, తెలంగాణ అభివృద్ధి కోసం చేసిన కృషిని వివరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని.. ప్రజల కోసం పోరాటం చేయాలని శ్రేణులకు కేసీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదని స్పష్టం చేశారు. ప్రజల కష్టాలు బీఆర్ఎస్‌కు మాత్రమే తెలుసునన్నారు. వందశాతం మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ కాంగ్రెస్ పాలనలో మళ్లీ వెనక్కి వెళ్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాతికేళ్ల స్ఫూర్తితో మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. భారాస మాత్రమే తెలంగాణ కోసం పోరాడగలదు. ప్రజల కష్టాలు భారాసకు మాత్రమే తెలుసు. వంద శాతం మళ్లీ అధికారంలోకి వస్తాం. పోరాడి సాధించుకున్న తెలంగాణ మళ్లీ వెనక్కిపోతోంది. పాతికేళ్ల స్ఫూర్తితో మళ్లీ తెలంగాణను నిలబెట్టుకునేందుకు పోరాడాలి. 'ఏడాది పొడవునా భారాస రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలి. ఏప్రిల్ 10న హైదరాబాద్‌లో భారాస ప్రతినిధుల సభ. రజతోత్సవ కార్యక్రమాల కోసం సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలి. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఇక నుంచి దృష్టి సారిస్తాం అని అన్నారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ ఉంటుంది. ఏప్రిల్ 10 నుంచి 27 వరకు సభ్యత్వ నమోదు. ఆ తర్వాత సంస్థాగత కమిటీల ఏర్పాటు. అక్టోబరు, నవంబర్‌లో పార్టీ అధ్యక్షత ఎన్నిక. పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయి. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం అందరూ కష్టపడాలి. ఒక్కసారి ఓటమికే కొట్టుకుపోయే పార్టీ కాదు భారాస. ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించిన పార్టీ. ఎమ్మెల్యేలు పార్టీ మారిన 10 స్థానాల్లో ఉప ఎన్నికలు ఖాయం. ప్రజల్లో ప్రభుత్వం గ్రాఫ్ పడిపోతోంది.. ఇక లేవదు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ పటిష్ఠంగా నిర్మించాలి. పార్టీ, ప్రజల శాశ్వత విజయం కోసం పనిచేయాలి' అని కేసీఆర్ సూచించారు. అంతకు ముందు ఎర్రవెల్లిలోని వ్యవసాయక్షేత్రం నుంచి కేసీఆర్ తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు తెలంగాణ భవన్ వద్ద పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు, శాసన మండలి సభ్యులు, శాసన సభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు హాజరయ్యారు.

## కుంభమేళాతో అయోధ్య, వారణాసిలకు తాకిడి

**భారీగా తరలిసవ్తున్న భక్తులతో జనసంద్రం**

**అయోధ్య రామాలయ పనులకు తీవ్ర అంతరాయం**

**అయోధ్య,ఫిబ్రవరి19:** మహాకుంభమేళా సందర్భంగా వారణాసి, అయోధ్య రామమందిరానికి భక్తుల తాకిడి భారీగా పెరిగింది. దీంతో ఈ రెండు నరగాల్లో వాహన రాకపోకలు కూడా ఇబ్బందిగా మారాయి. కుంభమేళా తిరుగు ప్రయాణంలో భక్తులు అయోధ్య, వారణాసిలను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో అయోధ్య రామమందిరం నిర్మాణ పనులు ఆగిపోయాయని కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. రామాలయ నిర్మాణ పనులు 25 రోజులుగా ఆగిపోయినట్లు ఆయన తెలిపారు. మార్చి నెలలో పూర్తి కావాల్సిన పనులు జూన్ నాటికి అవుతాయని నృపేంద్ర వెల్లడించారు. అయోధ్యలోని రామ జన్మభూమి సముదాయంలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులపై నృపేంద్ర మిశ్రా నేతృత్వంలో రెండు రోజులుగా సమావేశాలు జరుగుతున్నాయి. నిన్న(మంగళవారం) మె?దటి రోజు జరిగిన సమావేశంలో ఆలయానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు నృపేంద్ర తెలిపారు. ఆయన నిర్మాణాలు పరిశీలించామని, అలాగే కొన్ని కొత్త ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. మహాకుంభమేళా సందర్భంగా అయోధ్య బాల రాముడి దర్శనార్థం వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయ దర్శన, నిష్క్రమణ ద్వారాలను విస్తరించాలని ప్రణాళికలు రూపొందించినట్లు నృపేంద్ర తెలిపారు. దీనికి సంబంధించి నిర్మాణ కమిటీలోని ముఖ్య సభ్యులందరూ నేడు ఆలయాన్ని పరిశీలించి చర్యలు చేపడతారని చెప్పారు. అలాగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో భక్తుల బూట్లు, చెప్పులు ఉంచేందుకు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. రామ జన్మభూమి సముదాయంలోని 11వ నంబర్ గేట్ నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభ మయ్యాయని, అయితే భక్తుల తాకిడి వల్ల గేట్ నంబర్ 3 పనుల పూర్తి ప్రస్తుతం సాధ్యం కాదని చెప్పారు. అయితే ప్రస్తుతం మహాకుంభమేళాకు భక్తుల తాకిడి కొంతమేర తగ్గినందున ఇప్పటికే సిద్ధం చేసిన తులసీదాస్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని నిర్ణయించినట్లు నృపేంద్ర తెలిపారు. మరోవైపు జూన్ నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని, సెప్టెంబర్ నాటికి ప్రాకార నిర్మాణం పూర్తవుతుందని నిపేంద్ర వెల్లడించారు. కాగా, నేడు జరిగే సమావేశంలో మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది

## సిఇసిగా బాధ్యతలు స్వీకరించిన జ్ఞానేశ కుమార్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19:** భారత 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఈసి)గా జ్ఞానేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మార్చి 2024 నుండి ఎన్నికల కమిషనర్‌గా ఉన్న ఆయన సోమవారం నాడు సిఈసిగా పదోన్నతి పొందారు. మంగళవారం పదవీ విరమణ చేసిన రాజీవ్ కుమార్ స్థానంలో జ్ఞానేష్ కుమార్ పోల్ ప్యానెల్ అధిపతిగా నియమితులయ్యారు. అయితే ఆయన నియామకాన్ని కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. అర్ధరాత్రి సమయంలో సీఈసీ పేరు ప్రకటించడమేంటి? అని నిలదీసింది. ఇక ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. బుధవారం విచారణకు రానున్నాయి.

# 1 నుంచి 5 వరకు ప్రత్యేక అసెంబ్లీ!?

**- ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై 3 బిల్లులు - సభలో చర్చ నిర్వహించి బిల్లులకు చట్టబద్ధత**

**- మార్చి 10 నుంచి పార్లమెంటు సమావేశాలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 19:** ఎస్సీ వర్గీకరణ, బీసీలకు రిజర్వేషన్ల అంశంపై రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని భావిస్తోంది. వర్గీకరణకు చట్టబద్ధతపై ఒక బిల్లు, బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై మరొకటిబీ విద్య, ఉపాధి రంగాల్లోనూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన బిల్లులకు చట్టబద్ధత కల్పించనుంది. ఇందుకోసం మార్చి 1 నుంచి 5 వరకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై మూడు బిల్లులను ప్రవేశపెట్టనుంది. వాటిపై చర్చ జరిపి, ఆమోదించిన అనంతరం చట్టబద్ధత కల్పించనుంది. ఈ నేపథ్యంలో మూడు బిల్లుల ముసాయిదాల రూపకల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు. త్వరలోనే ప్రభుత్వానికి ముసాయిదాలు అందనున్నాయి. అవి అందిన వెంటనే రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై చర్చించనుంది. ఆ తర్వాత వాటిని ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదింపజేయనుంది. రాష్ట్రంలోని ఎస్సీలను మూడు గ్రూపులుగా వర్గీకరించాలంటూ ఏకసభ్య కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందించిన విషయం తెలిసిందే. మాల, మాదిగల్లోని ఉపకులాలన్నింటినీ మూడు గ్రూపులుగా విభజించింది. గ్రూపు-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యా పరంగా అత్యంత వెనకబడిన, పట్టించుకోని కులాలను చేర్చి వారికి 1 శాతం రిజర్వేషన్ కల్పించింది. గ్రూపు-2లో ఒక మోస్తరుగా లబ్ధి పొందిన కులాలను చేర్చి వారికి 9 శాతాన్ని ప్రతిపాదించింది. గ్రూపు-3లో మెరుగైన ప్రయోజనాలను పొందిన కులాలను చేర్చి వారికి 5 శాతాన్ని కేటాయించింది. మొత్తంగా కమిషన్ రాష్ట్రంలోని 59 కులాలకు 15 శాతం రిజర్వేషన్లను కేటాయించింది. సర్కారు ఈ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి తీర్మానం చేసింది. నివేదికను బిల్లు రూపంలోకి తీసుకొచ్చి, వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించింది. అలా చేస్తే రిజర్వేషన్ల అమలులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, కమిషన్ గడువును తాజాగా పెంచడంతో వర్గీకరణలో ఏవైనా మార్పులు ఉంటాయా? అనే చర్చ కూడా జరుగుతోంది.

**రిజర్వేషన్లపై కేంద్రంతో కొట్లాటే!**

బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఆ తర్వాత విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్ కల్పించాలనుకుంది. ఇప్పటివరకు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 29 శాతం రిజర్వేషన్లు అమలవుతున్నాయి. వాటికి అదనంగా మరో 13 శాతం పెంచాలని నిర్ణయించింది. బీసీలకు పెంచే రిజర్వేషన్‌ను ఏ, బీ, సీ, డీ, ఈ విభాగాల వారీగా పెంచాలని యోచిస్తోంది. అధికారులు కూడా ఆ మేరకే ముసాయిదాలు రూపొందించనున్నట్లు సమాచారం. అయితే బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ చేసే చట్టాన్ని రాష్ట్ర అసెంబ్లీ ఆమోదిస్తే సరిపోదని న్యాయనిపుణులు చెబుతున్నారు. పెంచిన రిజర్వేషన్లు అమలు కావాలంటే మళ్లీ సుప్రీంకోర్టును ఆశ్రయించాలి. లేదా పార్లమెంటులో ఈ చట్టాన్ని ఆమోదింపజేసి, రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలి. ఈ చట్టానికి కేంద్రం ఆమోదం తెలపకపోతే పోరాటం చేయాలని రేవంత్ సర్కారు భావిస్తోంది. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొనిపోవాలని యోచిస్తోంది. అన్ని పార్టీలకు త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి లేఖలు రాయనున్నట్లు తెలిసింది. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో బీసీలకు రిజర్వేషన్‌ను పెంచే బిల్లుకు చట్టబద్ధత కల్పించి, దాన్ని కేంద్రానికి పంపనున్నారు. మార్చి 10 నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమవనున్నాయి. అదే రోజు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ప్రతినిధులు ఢిల్లీ వెళ్లి బీసీలకు రిజర్వేషన్ పెంపు అంశాన్ని ఆమోదించాలని కేంద్రాన్ని కోరనున్నారు. మిగిలిన రాజకీయ పార్టీలను కూడా ఢిల్లీకి రావాలని కోరనున్నట్లు తెలిసింది. అలాగే దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కూడా డిమాండ్ చేయనున్నారు. మార్చి మూడో వారంలో ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను నిర్వహించనుంది. 2025-26 ఏడాదికి సంబంధించిన బడ్జెట్‌పై ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే కీలక శాఖలతో బడ్జెట్ కేటాయింపులు, గతంలో కేటాయించిన నిధుల ఖర్చు సహా అన్ని అంశాలపై సమీక్షలు నిర్వహించింది. ఈ క్రమంలోనే మార్చి 15 నుంచి 30 వరకు బడ్జెట్ సమావేశాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు తెలిసింది.

# ఢిల్లీ సిఎంపై వీడిన ఉత్కంఠ

**రేఖాగుప్తాను ఎంపిక చేసిన బిజెపి**

**ఆమోదించిన బిజెపి శాసనసభా పక్షం**

**ప్రధాని మోడీ అధ్యక్షతన బిజెపి భేటీలో నిర్ణయం**

**నేడు రామ్‌లీలా మైదానంలో సిఎంగా రేఖాగుప్తా ప్రమాణం**

**ప్రమాణ కార్యక్రమానికి హాజరవుతున్న ఎన్‌డిఎ పక్ష నేతలు**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి19:** ఢిల్లీ సీఎం ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. షాలీమార్ బాగ్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన రేఖా గుప్తాను బీజేపీ ఎమ్మెల్యేలు సీఎంగా ఎన్నుకున్నారు. రేమ్‌లీలా మైదానంలో జరిగే కార్యక్రమంలో ఆమె ఢిల్లీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారు. ముందునుంచీ ఆమె పేరుపైనే ప్రధాని మోడీ,అమిత్ షాలు మొగ్గు చూపారు. విద్యార్థి దశ నుంచి బిజెపి రాజకీయాలతో పెనవేసుకున్న రేఖాగుప్తాను బిజెపి అధిష్టానం గుర్తించి సిఎం పీఠంపై కూర్చోబెట్టింది. ఢిల్లీ ఎన్నికలు 5న జరగగా ఫిబ్రవరి8వ తేదీన ఫలితాలు వెల్లడైనప్పటినుంచి ఢిల్లీ సీఎంగా బీజేపీ ఎవరిని ఎంపిక చేస్తుందనే ఉత్కంఠ కొనసాగుతూ వచ్చింది.ఈ క్రమంలో బుధవారం సమావేశమైన బీజేపీ శాసనసభ పక్షం సీఎం అభ్యర్థిని ఎన్నుకుంది. రేఖాను ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

గురువారం రామ్‌లీలా మైదానంలో జరిగే ప్రమాణస్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాతో పాటు ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరవుతారు. ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబునాయుడు ఢిల్లీ సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు. ఢిల్లీ సీఎం ఎంపిక కోసం కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్, బీజేపీ జాతీయ కార్యదర్శి ఓపీ దన్కర్‌ను బీజేపీ అధిష్టానం నియమించింది. ఢిల్లీ బీజేపీ ఎమ్మెల్యేలతో సమావేశమైన ఈ ఇద్దరు పరిశీలకులు శాసనసభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే సమయంలో అధిష్టానం నిర్ణయాన్ని సభ్యుల ముందుంచారు. చివరిగా ఏకగ్రీవంగా రేఖా గుప్తా పేరును ఢిల్లీ సీఎంగా ఎన్నుకున్నారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలు విడుదలై 12 రోజులు పూర్తయినా.. సీఎం ఎవరనేదానిపై క్లారిటీ రాలేదు. బీజేపీ శాసనసభపక్ష సమావేశం జరగడానికి ముందువరకు కూడా పది పేర్లు వినిపించాయి. ముందుగానే బీజేపీ అధిష్టానం ఢిల్లీ సీఎం ఎవరనేదానిపై ఓ నిర్ణయానికి వచ్చినప్పటికీ ఆ పేరు బయటకు రాకుండా చివరవరకు గోప్యత పాటించింది. ఢిల్లీ సీఎం ఎంపిక కోసం నియమించిన పరిశీలకులు ఎమ్మెల్యేల సమావేశంలో అధిష్టానం నిర్ణయాన్ని వెల్లడించారు. బీజేపీ హైకమాండ్ నిర్ణయానికి ఎమ్మెల్యేలంతా ఓకే చెప్పడంతో ఎలాంటి వివాదం లేకుండా ఢిల్లీ సీఎం ఎంపిక జరిగిపోయింది. ముఖ్యంగా రేఖా గుప్తా, ఢిల్లీ బీజేపీ మాజీ అధ్యక్షుడు విజేందర్ గుప్తా, సతీష్ ఉపాధ్యాయ్, పవన్ శర్మ, ఆశిష్ సూద్, శిఖా రాయ్, పర్వేష్ సాహిబ్ సింగ్, రవీంద్ర ఇంద్రరాజ్ సింగ్, కైలాష్ గంగ్వాల్, అనిల్ గోయల్, రాజ్ కుమార్ భాటియా పేర్లు వినిపించాయి. అనూహ్యంగా రేఖ గుప్తాను బీజేపీ ఢిల్లీ సీఎంగా ఎంపిక చేసింది. గతంలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ సీఎంల ఎంపికలో అనూహ్యంగా కొత్తపేర్లను తెరపైకి తీసుకువచ్చింది. సామాజిక సమీకరణలతో పాటు తాజా రాజకీయ పరిస్థితులను పరిగణలోకి తీసుకుని బీజేపీ ముఖ్యమంత్రులను ఎంపిక చేస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇదే సూత్రాన్ని ఢిల్లీ సిఎం ఎంపికలోనూ బిజెపి పాటించింది.

## ఏప్రిల్ 27 బిఆర్ఎస్ భారీ బహిరంగ సభ

**ప్రజా ఉత్సవంగా బిఆర్ఎస్ రజతోత్సవం**

**ఏడాది పొడవునా కార్యక్రమాల నిర్వహణ: కెటిఆర్**

**హైదరాబాద్,ఫిబ్రవరి19:** భారాస రజతోత్సవం.. ప్రజా ఉత్సవంగా జరపాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. ఏడాది పాటు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక పాలనను తిప్పికొడతామని అన్నారు. తెలంగాణ భవన్‌లో అధినేత కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. సమావేశం వివరాలు వెల్లడించారు. 'ప్రజా ఉద్యమాలు, విప్లవ పోరాటాలకు పురిటిగడ్డ తెలంగాణ. తెలంగాణ పోరాటంలో ప్రాణత్యాగాల గురించి సమావేశంలో గుర్తు చేసుకున్నాం. రాబోయే కాలంలో పార్టీ కార్యక్రమాలపై కేసీఆర్ దిశానిర్దేశంచేశారు. అధికారమే పరమావధిగా పనిచేసే ఆలోచన లేదు. తెలంగాణ అస్తిత్వం, ప్రజల ప్రయోజనాలే ముఖ్యం. భారాస రజతోత్సవాలు ఏడాది పాటు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించాం. ఉత్సవాల నిర్వహణకు సీనియర్ నేతల ఆధ్వర్యంలో త్వరలో కమిటీలను ఏర్పాటు చేయబోతున్నామని కేటీఆర్ తెలిపారు. ఇదిలావుంటే ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. పార్టీ సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఏడాది పొడవునా ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలని శ్రేణులకు సూచించారు. అలాగే, పార్టీ కమిటీలు వేయాలని నిర్ణయించిన కేసీఆర్.. కమిటీలకు ఇన్‌చార్జ్‌గా హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏప్రిల్ పదో తేదీ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని.. ప్రతి జిల్లా కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. అనుబంధ సంఘాల పటిష్టత కోసం సీనియర్ నేతలతో సబ్ కమిటీలు వేయనున్నట్లు తెలిపారు.

# నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలి

**- వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటాం**

**- చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ కే రాజు చౌహాన్ హెచ్చరిక - ఏజెన్సీ మండలాల్లో ఆకస్మిక తనిఖీ**



**తొలిసమయం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఫిబ్రవరి. 19.**
నిరంతర విద్యుత్ సరఫరాకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ కే రాజు చౌహాన్ హెచ్చరించారు. బుధువారం కొత్తగూడ గంగారం మండలాలలోని వివిధ గ్రామాల్లో ఉన్నటువంటి సబ్ స్టేషన్ లను చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ కే రాజు చౌహాన్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యుత్ సమస్యల గురించి అడిగి తెలుసుకొని వోల్టేజ్ ప్రాబ్లమ్స్ ని అధిగమించడానికి మండలంలో ఏర్పాటు చేస్తున్న 600 కె వి ఏ ఆర్ లైన్ కెపాసిటర్స్ పనులని సందర్శించి సాదిరెడ్డిపల్లి మరియు ఓటాయి గ్రామాలలో 600 కె వి ఏ ఆర్ లైన్ కెపాసిటర్లని ప్రారంభించారు. కొత్తగూడ విద్యుత్ ఉపకేంద్రంలో జరుగుతున్న మరమ్మత్తులను పర్యవేక్షించి నాణ్యతతో కూడిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచిస్తూ ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ ఆపరేషన్ కే రాజు చౌహాన్ మాట్లాడుతూ...విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, విద్యుత్ సరఫరాలో ఓల్టేజీ సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు స్థానికంగా ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకోవచ్చి వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఫీడర్ ట్రిప్పింగ్స్,బ్రేక్ డౌన్స్ పై నిరంతరం సమీక్షిస్తూ, వాటిని పూర్తిస్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వం వహించే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి విజయ్ డిఈ ఆపరేషన్ మహబూబాబాద్, కవిత ఏడిఈ, సురేష్ ఏఈ మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహార అందించాలి

**మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, వసతి గృహల లో ఆకస్మిక తనిఖీ**

**తొలిసమయం మహబూబాబాద్ ఫిబ్రవరి. 19 :**
విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహార అందించాలని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్, మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు.బుధవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల, వసతి గృహల లో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్టడీ అవర్లో ఉన్న విద్యార్థుల దగ్గరి వెళ్లి పరీక్షల సంసిద్ధత పై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు, పరీక్షల పట్ల భయాన్ని వీడి పరీక్షలు అంటే ఒక అవకాశంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు, ప్రతి సబ్జెక్టులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాలన్నారు, పరీక్షల సమయం వస్తున్న సందర్భంగా పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహార అందించాలని వారి యొక్క వ్యక్తిగత, విద్య తదితర అంశాలు వివరాలపై ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, వసతి గృహంలోని పరిసరాలను ప్రతినిత్యం సానిటేషన్ చేస్తూ ఉండాలని,స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలన్నారు, భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు




తీసుకుంటూ ఉండాలని అన్నారు.

# న్యాయ కళాశాలకై ఉద్యమిద్దాం.!

**మార్చి 9న వెంకటాపురం మండల కేంద్రంలో న్యాయ నిపుణులతో సదస్సును జయప్రదం చేయండి**

**- గొండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి**



**వెంకటాపురం (తొలి సమయం) ఫిబ్రవరి19**
వెంకటాపురం మండలం కేంద్రంలో ఆర్ఎంబి విశ్రాంతి భవనం ఆవరణంలో ఆదివాసీ నాయకుల సమావేశం ఏర్పాటు చేసి,భద్రాచలం కేంద్రంగా ఆదిమ జాతుల కోసం,న్యాయ కళాశాల కోసం మరో న్యాయ పోరాటంలో భాగంగా మార్చి 9న వెంకటాపురం మండల కేంద్రం కాపేడ్ గ్రౌండ్ లో ఆదివాసి న్యాయ నిపుణులు,ఆదివాసీ సంఘాల నాయకులతో ఏర్పాటు చేసిన సదస్సును జయప్రదం చేయాలని కరపత్రాలు విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా జి.ఎస్.పి రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి మాట్లాడుతూ.ఏజెన్సీ ప్రాంత అడవి బిడ్డల విద్యారంగంలో ముందుకు రాణించాలని,ప్రత్యేక దృక్పథంతో సుమారు నాలుగు దశాబ్దాలుగా అడవి బిడ్డలుగా ఆలు పెరగని పోరాటాలు కొనసాగించిన ఘనత గొండ్వాన సంక్షేమ పరిషత్ దకిందని,ప్రత్యేక ఉద్యమ సంఘంగా ఆదిమ జాతులకు సేవలు అందించిన చరిత్ర జిఎస్పి కి ఉందని అన్నారు. ఆదిమ జాతుల సంక్షేమాన్ని అభివృద్ధిని మనస్ఫూర్తిగా కాంక్షించిన ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ఖమ్మం జిల్లా కలెక్టర్ శ్రీ ఏ గిరిధర్, ఐఏఎస్ గారు జి.ఎస్.పి పోరాటాలను గుర్తించి ఆదిమ విద్యార్థులను మరింత విద్య రంగంలో వెన్ను దన్నుగా నిలిచారని గుర్తుచేశారు.ఉద్యోగ రంగంలో ఆదివాసులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ఆనాటి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జీవో నెంబర్ 3 అమలు పరచాలి ప్రత్యేక కృషి చేసిన ఘనత ఆనాటి కలెక్టర్ శ్రీ ఏ గిరిధర్ గారికి తగ్గిందని వారి వల్లే భద్రాచలంలో జూనియర్ డిగ్రీ కాలేజీలలో 6%శాతం రిజర్వేషన్ నుండి జీవో నెంబర్ 267 ద్వారా 100% అమలుకు నోచుకుందని ఆయన అన్నారు.అప్పటి ఐటీడీఏ పీవో ప్రవీణ్ ప్రకాష్ ఐఏఎస్ గారు అప్పటి జిల్లా కలెక్టర్ వారి యొక్క ప్రత్యేక దృష్టి వల్ల భద్రాచలం కేంద్రంలోని టిటిసి బి.ఎడ్ కాలేజీలు వచ్చాయని అన్నారు.విద్యార్థుల స్వయంపాలన హాస్టల్స్ కూడా 1996,2017 కొనసాగుతున్నాయని ఆయన గుర్తు చేశారు.ఇదే తరుణంలో ఆదిమ జాతులకు మరింత చైతన్య రాణించేందుకు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ లా తీర్చిదిద్దేందుకు,భూభాగంలో భద్రాచలం కేంద్రంగా ఆదివాసి న్యాయ కళాశాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని మనస్ఫూర్తిగా కోరుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కనితి వెంకటకృష్ణ వర్కింగ్ ప్రెసిడెంట్ పూనెం ప్రతాప్, బొచ్చ నరసింహారావు, కాక శేఖర్,జయబాబు,కారం రాజబాబు,పర్శిక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సమర్థ నాయకత్వమే కాంగ్రెస్ సమస్య !

గుర్రం ఎంత వడిగలదైనా..రౌతు సరిగా లేకపోతే అది కుంటుతూ నడుస్తుందని సామెత. ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి అదే. కాంగ్రెస్ పార్టీకి సమర్థ నాయకత్వమే ఇప్పుడు లోపం. దానిని అందిపుచ్చుకునే ప్రయత్నం చేయడంలో రాహుల్ పెద్దగా పని చేయడం లేదు. ఆయన ఛరిష్మా పనిచేయడం లేదు. గత పార్లమెంట్‌లో ప్రతిపక్షహోదా కూడా దక్కని పార్టీకి ప్రజలు ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష మోదా కల్పించారు. లోక్‌సభలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రతిపక్షనేతగా ఉన్నారు. అయితే ఆయనక ఈ దేశంపైనా, సమస్యలపైనా పెద్దగా అవగాహన లేకపోవడం ప్రజలు చేసుకున్న దురదృష్టంగా చెప్పుకోవాలి. సమర్థత లేకపోవడం వల్లనే లోక్‌సభలో ప్రజల సమస్యలపై గట్టిగా నిలదీయలేక చతికిల పడుతున్నారు. విపక్షనేత ఎంత సమర్థుడ యితే అంతగా అధికార పక్షం ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేస్తుంది. కాంగ్రెస్‌లో ఆ లక్షణాలు కనిపించడం లేదు. అలాంటి లక్ష్యం కూడా కానరావడం లేదు. కేవలం సొంత ఎజెండాతో పోవడం వల్లనే మోడీ మరింత బలోపేతం అవుతున్నాడు. కూటమిగా ఏర్పడ్డ ఇండియా కూటమి ఓ రకంగా చెప్పాలంటే విచ్ఛిన్నం అయ్యిందనే చెప్పాలి. ఆప్ అంటే కాంగ్రెస్‌కు పడదు. కాంగ్రెస్ అంటే మమతా బెనర్జీకి పడదు. నాయకుడు అన్నవాడు విపక్షంలో ఉంటే విపక్ష పార్టీలను కలుపుకుని పోవాలి. కానీ ర ఆహుల్‌లో అలాంటి నాయకత్వ లక్షణాలు మచ్చుకైనా కానరావడం లేదు. ఇకపోతే ప్రాంతీయ పార్టీలు అధికారం వెలగబెట్టడం, అప్పులు చేయడం, రాష్ట్రాలను దివాళా తీయించడం అలవాటుగా చేసుకున్నాయి. కెసిఆర్, జగన్ పాలనతో ఉభయ తెలుగు రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీసాయి. క్రమక్రమంగా ఆయా ప్రాంతీయ పార్టీలను, వాటి నాయకులు రాష్ట్రాలను తమ సొంత ఆస్తులుగా,జాగీర్లుగా మార్చి ఏలుతున్నారు. అయితే వాటిని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. దానికి స్పష్టమైన సంకేతంగా మన ఉమ్మడి ఎపి అని వేరుగా చెప్పనక్కరలేదు. ఈ రెండు రాష్ట్రాల్లో కుటుంబ పెత్తనం, నేతల అహంకారం పెరిగిపోవడంతో ప్రజలు వారిని అధికారం నుంచి దూరం పెట్టారు. కర్నాటకలో ఓ వెలుగు వెలిగిన దేవెగౌడ, కుమారస్వామిల జేడీఎస్ ఇప్పుడు బిజెపికి తోకపార్టీగా మిగిలిపోయింది. ఇక మొన్నటి ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌ను కూడా ప్రజలు ఊడ్చిపడేశారు. ఈ పరిస్థితులు చూస్తుంటే భవిష్యత్తులో పశ్చిమబెంగాల్లో మమత సారథ్యంలోని తృణమూల్ కాంగ్రెస్, బిహార్‌లో నితీష్ సారథ్యంలోని జేడీయూలకు ఇదే గతిపట్టినా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. 2014కు ముందు దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ స్థానాన్ని ఒక దశాబ్దం నుంచి ఆయా ప్రాంతీయ పార్టీలు ఆక్రమించు కున్నాయి. యూపిఎ కూటమిలోని పార్టీల అవినీతిని భూతద్దంలో చూపెట్టి రాజకీయాల్లోకి గోబెల్స్ ప్రచారంతో వచ్చిన అర్వింద్ కేజీవ్రాల్ సైతం నేడు అదే అవినీతి కేసులతో ప్రజల చేతిలో దెబ్బతిన్నాడు. ఇప్పుడు అవినీతి వ్యతిరేకత నినాదాన్ని తుడిచిపెట్టేశాడు. దేశానికి దిశా నిర్దేశం చేయగల సమర్థుడని నమ్మిన ప్రజలను కేజ్రీవాల్ మోసం చేశాడు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అనే నినాదాన్ని నిజం చేయాలనే మోడీ కలలు ఏమాత్రం నెరవేరడం లేదు. ఎందుకంటే ప్రజలు మోడీ విధానాల పైనా గుర్రుగా ఉన్నారు. నిత్యావసర ధరల పెరుగుదల,నిరుద్యోగం, జిఎస్టీ వంటి సమస్యలను పట్టించుకోక పోవడంతో ప్రజలు మరోమారు కాంగ్రెస్‌కు ఊపిరి పోశారు. మోడీ సరిగా వ్యవహరించివుంటే కాంగ్రెస్‌కు ఈ అవకాశం కూడా వచ్చివుండేది కాదు. ఉత్తరాది హిందీ రాష్ట్రాల్లో బీజేపీకి కొంత అనుకూలించి అధికారంలోకి రాగలిగి నప్పటికీ బిజెపిలో భయాందోళనలను కలిగిస్తోంది. ఎందుకంటే దాదాపు పదేళ్ల తర్వాత పార్లమెంట్లో ప్రతిపక్ష హోదాను కాంగ్రెస్ దక్కించుకుంది.

# ముగిసిన మినీ పగిడిద్దరాజు జాతర




**తొలిసమయం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఫిబ్రవరి. 19.**
ఆదివాసీల ఆరాధ్య దైవం అయిన పగిడిద్దరాజు జాతర బుధవారం రోజుతో ముగియనుంది ప్రతి రెండు సంవత్సరములకు ఒకసారి జరుగు మేడారం మహజాతర అయిన సమ్మక్క భర్త పగిడిద్దరాజు జాతర మినీ జాతరను మూడు రోజులు గిరిజన సంప్రదాలలో నిర్వహించుకున్నారు. భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నీర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు మూడవరోజు బుదవారం తిరుగువారం పండగ నేటితో మూగయనున్నది ఈరోజు పూజారులు అందరూ కలిసి భక్తిశ్రద్ధలతో గుడి కడిగి పూజా సామాగ్రిని శుద్ధిచేసి స్వామీ వారికి అలంకరణ చేసి భక్తిశ్రద్ధలతో పూజా చేసి ముగించు కున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన పూజారి పెనుక బుచ్చి రాములు, రాజేశ్వర్,సురేందర్, సమ్మయ్య,వెంకయ్యపురుషోత్తం పాల్గొన్నారు.

# ఘనంగా ఎంపీ ఆర్ఆర్ఆర్ జన్మదిన వేడుకలు

**పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో కేక్ కటింగ్**

**ప్రభుత్వ ఆసుపత్రిలో పాలు పండ్ల పంపిణీ**




**తొలిసమయం, కొత్తగూడెం ఫిబ్రవరి 19 :**
ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాంరెడ్డి జన్మదిన వేడుకలు భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఘనంగా జరిగాయి. ముందుగా కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యలయంలో కేక్ కటింగ్ చేసి ఎంపీ ఆర్ఆర్ఆర్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ జన్మదిన వేడుకల్లో మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, పెద్దబాబు, రైల్వే బోర్డు సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఐఎన్టీయూసి వైస్ ప్రెసిడెంట్స్ రజాక్, పితాంబరం, నాయకులు విప్లవ రెడ్డి, సుజాతనగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, మాజీ కౌన్సిలర్స్ మాసూద్, సుందర్ రాజ్, దిశ కమిటీ సభ్యులు ఆనంద్, కాంగ్రెస్ నాయకులు పూనెం శ్రీనివాస్, బాల పాసి, చింతా నాగరాజు, మాజీ సర్పంచ్ బండ వెంకటేశ్వర్లు, మాలోత్ బలరాం, ఓబీసీ నాయకులు బొబ్బల వెంకట్ యాదవ్, మహిళా నాయకురాళ్లు వాణిరెడ్డి, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

# నిత్యం రైస్ మిల్లులను తనిఖీలు నిర్వహిస్తాం

**నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం**

**మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కె.వీరబ్రహ్మచారి**




**తొలిసమయం మహబూబాబాద్ ఫిబ్రవరి. 19.**
జిల్లా యంత్రాంగం సంబంధిత శాఖలు నిత్యం రైస్ మిల్లులను తనిఖీలు నిర్వహిస్తామని ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కె.వీరబ్రహ్మచారి అన్నారు.బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ సాయి, జగదాంబ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కె.వీరబ్రహ్మచారి ఆకస్మికంగా తనిఖీ చేసి రైస్ మిల్లులోని రికార్డులను పరిశీలించారు, ప్రభుత్వం సూచించిన జిల్లా లక్ష్యం ప్రకారం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) డెలివరీలను షెడ్యూల్ ద్వారా వెంటనే చేయాలని ఖరీఫ్ 2024 -25 కు సంబంధించి సీఎంఆర్ లక్ష్యాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వేగంగా చేయాలని మిల్లర్లను ఆదేశించి మిల్లులకు సంబంధించి పూర్తి వివరాల రికార్డులను క్రమం తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చీకటి కార్తీక్‌కు మంత్రి పొంగులేటి అభినందన

**పార్టీ గెలుపులో యువజన నాయకుల పాత్ర కీలకం**

**ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని సూచన**



తొలిసమయం, కొత్తగూడెం ఫిబ్రవరి 19, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నియమితులై ప్రమాణస్వీకారం చేసిన అనంతరం తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని చీకటి కార్తీక్ హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చీకటి కార్తీక్ ను మంత్రి పొంగులేటి అభినందించారు. పార్టీ గెలుపులో యువజన నాయకుల పాత్ర కీలకమన్నారు. రాబోవు స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్ళేలా యువజన నాయకులు కృషి చేయాలన్నారు. అదేవిధంగా యువజన విభాగం తరుపున విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని చీకటి కార్తీక్ కు మంత్రి పొంగులేటి సూచించారు.

## పెద్దగట్టు లింగ మంతుల స్వామిజాతరలో

# యాదవనాయకులు మేకల మల్లిబాబు

**తొలిసమయం, ఇల్లందు. ఫిబ్రవరి. 19.**
సూర్యాపేట జిల్లా దురాజ్ పల్లి గ్రామంలోని పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర కార్యక్రమంలో ఖమ్మం జిల్లా అఖిలభారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ దంపతులు కుటుంబ సమేతంగా మరియు జిల్లా అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య దంపతులు కుటుంబ సమేతంగా పాల్గొని మొక్కులు చెల్లించారు.. జాతర చైర్మన్ పోలేపల్లి నరసయ్య వారికి ఘనస్వాగతం పలికి జాతర వైభవాన్ని దగ్గరుండి చూపించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెండో అతిపెద్ద జాతరైన లింగమంతుల స్వామి జాతర అభివృద్ధి కొరకు ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు కోట్లు రూపాయలు కేటాయించిందని, కానీ ఈ సంవత్సరం అంచనాలకు మించి జాతరకు భారీ ఎత్తున భక్తులు పాల్గొనడం వలన సౌకర్యాలు పూర్తిస్థాయిలో సరిపోలేదని, మాట ఇస్తే ప్రాణం పోయినా మాట తప్పని యాదవ జాతి కొలుచుకునే లింగమంతుల స్వామి ఆలయాన్ని ఇంకా ప్రభుత్వం శ్రద్ధ పెట్టి అభివృద్ధి చేయాలని, ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐదు రోజులు జరిగే ఈ పెద్ద జాతర కార్యక్రమానికి భారీ ఎత్తున యాదవులు పాల్గొనే అవకాశం ఉందని, దీని రాష్ట్ర ప్రభుత్వం పండుగగా గుర్తించి రెండు రోజులు ప్రభుత్వ సెలవు దినాలుగా



ప్రకటించాలని, వచ్చే ఏడాది జరిగే జాతరకు భారీ ఎత్తున సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో , లోడిగ వెంకన్న, చేతుల నాగేశ్వరరావు మొరిమేకల కోటయ్య, పొదిల భూపతి మేకల నాగేశ్వరరావు మలుపుల గణేష్, మెరిగల తిరుపతిరావు, మల్లేశం సత్తి వెంకన్న పల్లెబోయిన శ్రీను, పొదిలి సతీష్, తెల్లబోయిన రమణ, పారి నాగేశ్వరరావు, దాసరి వెంకన్న, చెన్ను వెంకటరమణ బొల్లి సైదులు పల్లెబోయిన పుల్లారావు కుటుంబాలతో మరియు యాదవులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# 64 కేజీల గంజాయి పట్టివేత..

**టాటా సఫారీ స్వాధీనం.. ఒక వ్యక్తి అరెస్ట్..**



**తొలి సమయం క్రైం భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 19:**
ఆంధ్ర-ఒరిస్సా సరిహద్దు అటవీ ప్రాంతం నుంచి బెంగళూరు కు టాటా సఫారీ కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని బుధవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే..ఆంధ్ర-ఒరిస్సా బోర్డర్ నుంచి బెంగళూరు కు గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు, కొత్తగూడెం ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ మరియు మణుగూరు ఎక్సైజ్ స్టేషన్ టీమ్స్ మణుగూరు లోని రథంగుట్ట అర్బన్ పార్క్ వద్ద తనిఖీలు చేపట్టారు.అనుమానంగా వచ్చినటువంటి టాటా సఫారీ కారును తనిఖీ నిర్వహించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని తూకం వేయగా 64 కేజీలుగా ఉన్నట్లు ఎక్సైజ్ పోలీసులు నిర్ధారించారు.గంజాయి తో పాటు టాటా సఫారీ వాహనాన్ని, ఒక మొబైల్ ఫోన్ను స్వాధీన పరచుకుని, ఒక వ్యక్తిని అరెస్ట్ చేశారు. స్వాధీన పరచుకున్న వాటి విలువ కలిపి రూ. 19.10 లక్షలు గా ఉంటుందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్డెంట్ కరమ్ చంద్ తెలిపారు. అరెస్టు కాబడిన వ్యక్తి కేరళ కు చెందిన మహ్మద్ జమీర్ గా ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐ రాజిరెడ్డి, ఎస్.ఐ లు గౌతమ్, కిషోర్ బాబు, సిబ్బంది హబీబ్ పాషా, వెంకట నారాయణ, సుమంత్, ప్రసన్న, శ్రీను, ఆంజనేయులు, పార్థసారథి, రమేష్ పాల్గొన్నారు. గంజాయి పట్టుకున్నటువంటి టీమును ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్ రెడ్డి, ఖమ్మం డివిజన్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, కొత్తగూడెం ఎక్సైజ్ సూపర్డెంట్ జానయ్య అభినందించారు,

# సింగరేణి ఫారెస్ట్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసిన నర్సరీ కార్మికులు

**ఐక్య పోరాటాల ఫలితంగా కనీస వేతనాలు అమలు**



**తొలి సమయం భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి19:**
సింగరేణి వ్యాప్తంగా నర్సరీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సింగరేణి యాజమాన్యం కనీస వేతనాలను జీవో ప్రకారం చెల్లించుటకు, 8.33 బోనస్ అమలు, సీఎం పీఎఫ్ సౌకర్యం, హాస్పటల్ సౌకర్యం మరియు బ్యాంకు జీతాలు అమలు చేయుటకు నిర్ణయించి మార్చి ఒకటో తేదీ నుండి అమలుకు సర్క్యులర్ విడుదలకు కృషిచేసిన సింగరేణి ఫారెస్ట్రీ అధికారులకు ఏఐటీయూసీ నాయకులు, నర్సరీ కార్మికులు కృతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం నాడు కొత్తగూడెం సింగరేణి నర్సరీలో కాంట్రాక్ట్ కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించి నారు.ఈ సమావేశంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య,ఉపాధ్యక్షులు కే డబ్ల్యు కృష్ణఫర్ లు పాల్గొని మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా సింగరేణి వ్యాప్తంగా నర్సరీలలో కాంట్రాక్ట్ కార్మికులకు సరైన సౌకర్యాలు లేకుండా,కనీస వేతనాలు లేకుండా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఏఐటీయూసీ తో పాటు ఇతర కార్మిక సంఘాలను కలుపుకొని అనేక పోరాటాలు చేసిన ఫలితంగా,అలాగే 2022లో జేఏసీగా 18 రోజులు సమ్మె చేసి చట్టబద్ధమైన ఒప్పందం చేసుకున్న ఫలితంగా నేడు సింగరేణి యాజమాన్యం నర్సరీ కార్మికులకు మార్చి ఒకటో తేదీ నుండి జీవో ప్రకారం కనీస వేతనాలు చెల్లించుటకు ఇతర సౌకర్యాలు కల్పించుటకు సర్కులర్ ను విడుదల చేశారని తెలిపారు.

అందుకు కృషిచేసిన సింగరేణి డైరెక్టర్స్ కు మరియు ప్రత్యేకంగా సింగరేణి ఫారెస్ట్ అధికారులకు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి గుర్తింపు సంఘం- %ూ×ుఖజ% తో ఐకమత్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ కృష్ణకుమారి మరియు నర్సరీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇల్లందు పట్టణములో పలు కుటుంబాలను పరామర్శించిన మడత

తొలిసమయం, ఇల్లందు.ఫిబ్రవరి 19:
పట్టణంలోని 17 వ వార్డుకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఘన్ శ్యామ్ లాహోటి గారు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. లాహోటి గారి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఇల్లందు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్ గౌడ్ మరియు ఏక్తా హౌస్ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు కొద్ది రోజుల




క్రితం యాక్సిడెంట్ తో మృతి చెందిన ఇల్లందు పట్టణ పార్టీ నాయకులు దేరంగుల పోచం గారి కుమారుడు దేరంగుల సాయి మృతి చెందడం జరిగింది వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తోడుగా నేనుంటానని హామీ ఇచ్చిన మడత

**నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో**

## చిట్యాల జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ

**తొలి సమయం తొర్రూరు ఫిబ్రవరి19**





పెద్ద వంగర మండలం చిట్యాల జెడ్పిహెచ్ఎస్ చెందిన విద్యార్థులు వర్రె వర్షిత్ ఆవుల తరుణ్ దేశవ్యాప్తంగా ఎనిమిదో తరగతి విద్యార్థులకు నవంబర్ 2024లో నిర్వహించిన నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ పరీక్షలో అర్హత సాధించారు. మండలంలోని చిట్యాల విద్యార్థులు మాత్రమే అర్హత సాధించడం కొసమెరుపు ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు చొప్పున స్కాలర్షిప్ నాలుగు సంవత్సరాలు అందివ్వడం జరుగుతుంది మొత్తముగా 48 వేల రూపాయలు స్కాలర్షిప్ ద్వారా అందించబడుతుంది ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆరోజు విజయ్ కుమార్ మరియు ఉపాధ్యాయులు కష్టపడి చదివి స్కూలుకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని అభినందించారు

## మీనాక్షి నటరాజన్‌తోనే కాంగ్రెస్ బలోపేతం

**ఆదివాసీ నిర్మల్ జిల్లా కాంగ్రెస్ చైర్మన్ గోవింద్ నాయక్ బాణావత్**

**తొలి సమయం డెస్క్ ఫిబ్రవరి 21:**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి గా





నియమితులైన మీనాక్షి నటరాజన్ తో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని నిర్మల్ జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ అన్నారు. ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు ట్రైకర్ చైర్మన్ డాక్టర్ తేజవత్ బేల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో నాగార్జున్ సాగర్ లో ఇటీవల కాలంలో ఏడు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించారు . ఈ శిక్షణ తరగతులకు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జి ఏఐసిసి కార్యదర్శి మీనాక్షి నటరాజన్ పాల్గొని భారత్ రాజ్యాంగం పట్ల అవగాహనా కాంగ్రెస్ పార్టీ గత 75 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ గురించి వివరించారాని అయన తెలిపారు మీనాక్షి నటరాజన్ తెలంగాణ కు ఇంచార్జి గా రావడం తో ప్రతి కార్యకర్తలు సంతోషంగా ఉన్నారని గోవింద్ నాయక్ చెప్పారు

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న పిఎసిఎస్ చైర్మన్ సంపేట రాము



**తొలి సమయం దంతాలపల్లి ఫిబ్రవరి 19**
దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన మిడతపల్లి మధు కుమారుడి పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ వేడుకలకు పి ఎస్ సి ఎస్ చైర్మన్ సంపేట రాము ముఖ్యఅతిథిగా హాజరై ఆశీర్వదించాడు. ఈ కార్యక్రమంలో సమ్ పేట కృష్ణార్జున పంజా అనిల్ మామిడి గోపి వీరన్న ఉప్పలయ్య ఎస్వీఆర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకలు పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి




**తొలి సమయం తరువులు ఫిబ్రవరి 19**
పెద్ద వంగర మండలం అంతపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు అశోక్ కుమారుడి మొదటి జన్మదిన వేడుకలు పాల్గొన్న పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డి చిన్నారికి పుట్టినరోజు సందర్భంగా వేడుకలో పాలుపంచుకున్నారు ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నియోజకవర్గ నాయకులు పార్టీ సీనియర్ నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

**కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ని వ్యతిరేకిస్తూ**

## అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన

**తొలిసమయం, ఇల్లందు.ఫిబ్రవరి. 19**



కేంద్ర ప్రజా వ్యతిరేక బడ్జెట్ ని వ్యతిరేకిస్తూ ఈరోజు అఖిలపక్షం ఆధ్వర్యంలో ఇల్లందు బస్టాండ్ సెంటర్ లో నిరసన కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ నాయకులు బందం నాగయ్య, సిపిఐ (ఎం) నాయకులు అలేటి కిరణ్, సురేష్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఇల్లందు సబ్ డివిజన్ కార్యదర్శి బి రాంసింగ్, బి ఎన్ కాంతారావు సిపిఐ (ఎం-ఎల్) మాస్ లైన్ నాయకులు నాయిని రాజు, యాకుబ్ షావలి, అజ్మీర బిచ్చ, సిపిఐ ఎం ఎల్ న్యూడెమోక్రసీ (వైకె) నాయకులు ఎండి రాసుద్దీన్, మోకాళ్ళ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల నిర్లక్ష్యంతోనే సమస్యలు

దేశ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై



ప్రభుత్వాలు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదు. గ్రామాల్లో ఆర్థిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరిగితేనే జాతీయ అభివృద్ధి సాధ్యమన్న కనీస పరిజ్ఞానం పాలకులకు లేకుండా పోతోంది. వ్యవసాయం, అనుబంధ పరిశ్రమలను పెద్ద ఎత్తున్న ప్రోత్సహించే కార్యాక్రమాలు చేపట్టడం లేదు. దీంతో ఉద్యోగాల కోసం ప్తి ఒక్కరూ పట్టాణలపై ఆధారపడాల్సి వస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంటే దేశం బలంగా ఉంటుందన్నది చాణుక్యుడి కాలం నుంచి అమల్లో ఉంది. చాణుక్యుడు ఈ సూత్రం ఆధారంగానే గ్రామాలను బలోపేతం చేయాలని సూచించారు. ఆయన అర్థ శాస్త్రంలో ఎలాంటి ఆర్థిక వ్యవస్థ అవసరమో సూచించారు. ఎలాగైతే మన ఆర్థిక వ్యవస్థ బలపడుతుందో తెలిపారు. కానీ పాలకులు దానిని పాఠ్యపుస్తకాల్లోంచి తీసేసారు. తమ మెదళ్లోంచి తీసేసారు. దాన్ని అమలు చేయాలన్న విషయాలను మరిచారు. నిజానికి దేశం బాగుడాలంటే గ్రామాలు బలపడాలి. గ్రామాలు ఆర్థికంగా వృద్ది చెందాలి. వ్యవసాయం అందుకు ఆలంబన కావాలి. అన్నదాతలు ఆర్థికంగా బలపడితేనే అనుబంధ రంగాలకు ప్రాధాన్యం పెరుగుతుంది. అయితే వ్యవసాయికంగా మనం పంటల ఉత్పత్తిలో చూపిస్తున్న శ్రద్ద వ్యవసాయ అనుబంధరంగాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో అన్ని విధాలుగా మనమంతా అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఈ ఒక్క సూత్రాన్ని పాటిస్తే పంట ఉత్పత్తులతో పాటు..నిరుద్యోగ సమస్యకు చెక్ పెట్టడమే గాకుండా... గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడగలం. గ్రామస్థాయిలో ప్రణాళికలు రచించి అమలయ్యేలా కార్యాచరణ సాగడం లేదు. దీనికితోడు గ్రామాల్లో ఏం జరగాల్లో ఇక్కడి నుంచి రిమోట్ ద్వారా నిర్దేశించడం, కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించడం వంటి చర్యల కారణంగా ఇంకా వలసలు పెరిగి పట్టణాలపై ప్రజలు ఆధారపడు తున్నారు. ఈ కారణంగానే గ్రామాల్లో ఉపాధి, ఉద్యోగావకాశాలు రావడం లేదు. ఈ కారణంగానే గ్రామాల్లో కూలీల సమస్య తీవ్రంగా మారింది. గ్రామాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రజలు పట్టణాలకు వలస వస్తున్నారు. దీంతో పట్టణాలపై భారం పడుతోంది. దీనిని ప్రభుత్వాలు గమనించడం లేదు. గ్రామీణ అర్థిక వ్యవస్థను బలోపే తానికి గ్రామాలు యూనిట్‌గా సర్పంచ్‌లను బాధ్యులను చేసేలా కార్యక్రమాల అమలు జరగడం లేదు. అన్నీ సచివాలయం నుంచి సిఎం పర్యవేక్షణలో జరగడం వల్ల గ్రామాలు వట్టిపోవడానికి కారణం అవుతున్నాయి. గ్రామాలకు కేంద్రం నుంచి వచ్చిన నిధులను మింగుతున్న వైనం సరికాదు. గ్రామాలపై ఇక్కడ పెత్తనం చేయడం వల్ల అవి అభివృద్ధి చెందడం లేదు. గ్రామాలను స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సాహించాలే తప్ప కర్రపెత్తనం చేయడం సరికాదు. ఆర్థికంగా పంచాయితీలు బలోపేతంగా లేక పోవడంతో పాటు, సర్పంచ్‌లు కూడా బాధ్యతారహి తంగా వ్యవహరించడం వల్ల గ్రామాల్లో పారిశుద్య కార్యక్రమాలు మొదలు ఇతరత్రా కార్యక్రామలు బలంగా ముందుకు సాగడంలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యల కారణంగా గ్రామాల్లో లక్ష్యాన్ని సాధించడం లేదు. పారిశుద్యం, వీధులు శుభ్రంగా ఉంచుకోవడం, ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడం తదితర అంశాలు సామాజిక బాధ్యత కావాలి. సర్పంచ్‌లకు అజమాయిషీ ఉండాలి. ఈ రకమైన చైతన్యం కోసం ఉద్యమించాల్సి ఉంది. పంచాయతీల్లో జనాభాకు సరిపడా పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పల్లెలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రధానంగా అన్ని పనులను ప్రభుత్వంమే చేస్తుందన్న ధీమాలో ప్రజలు ఉన్నారు. ఓటుబ్యాంక్ రాజకీయాల కారణంగా ప్రజలు అచేతనంగా తయార య్యారు. వారిని బాధ్యులను చేసేలా చర్యలు ఉండడం లేదు. పరిశుభ్రత లోపించిన కారణంగానే వ్యక్తిగతంగానే గాక పరిసరాల శుభ్రతా లోపించి అతిసారం, కలరా వంటి వ్యాధులు పెచ్చరిల్లుతున్నాయి. తాజాగా కరోనా ఇంకా విజృంభించడానికి పరిశుభ్రతా లోపం కూడా కారణంగా చూడాలి. కరోనాలాంటి వైరస్‌లను అరికట్టాలంటే పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి. మురికివాడల వద్ద ఖాళీ ప్రదేశాలు,పొలం ప్రాంతాలు, గ్రామ శివారు స్థలాలు, రైలు పట్టాల పరిసరాల్లో కాలకృత్యాలు హానికరంగా పరిణమిస్తు న్నాయి. ప్రధానంగా పారిశుధ్యం అన్నది పంచాయితీల సామాజిక బాధ్యతగా చేయాలి. స్వచ్ఛత అన్నది వ్యక్తిగత మైన శ్రద్దకు సంబంధిం చినదే అయినా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో ఇలాంటి శ్రద్ద తక్కువనే చెప్పాలి. వ్యక్తిగత మరుగదొడ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి కావడం లేదు. కరోనా లాంటి వైరస్‌లు విజృంభించి అనారోగ్యాల బారిన పడుతున్నా ప్రజలు ఇందుకు కారణాలు అపరిశుభ్రత అని గ్రహించడం లేదు. గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. మురుగునీరు ఎక్కడపడితే అక్కడ వచ్చి చేరుతోంది. పారిశుద్య కార్యక్రమాల్లో ఏ గ్రామానికి ఆగ్రామ సర్పంచ్‌ను బాధ్యుడిని చేస్తే సరిపోయేది. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం తొలిసారిగా ఆర్థిక చేయూత ఇవ్వడం ద్వారా గ్రామాల్లో కొంత మార్పు కనిపిస్తోంది. అయితే ఇప్పటికీ పూర్తిస్థాయిలో దీని కార్యక్రమం సాగడం లేదు. ఆరుబయట మలవిసర్జన కారణంగా మనదేశంలో అనారోగ్యకర వాతావారణం ఎక్కువే. అలాగే వ్యాధుల సంక్రమణ, అంటువ్యాధుల వ్యాప్తి కూడా ఎక్కువే. దీనికి ప్రజలతో పాటు ప్రభుత్వాల వైఫల్యం కూడా ఉంది. గ్రామ స్థాయిలో పనులకు సర్పంచ్‌లను బాధ్యులను చేయడం లేదు. వారికి ఆర్థిక స్వేచ్ఛను ఇవ్వడం లేదు. ఇకపోతే అనేక పథకాలకు ఆర్థిక చేయూత నిచ్చినా గ్రామాల్లో ప్రజల్లో పెద్దగా స్పందన రావడం లేదు. సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించి గ్రామకమిటీ ద్వారా ఈ వ్యవహారం నడిపించివుంటే బాగుండేది. ఈ విషయంలో ఇరు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అయినట్లే. చాలా పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెలా వేలాది రూపాయల వేతనాలుగా అందిస్తున్నా ఫలితం మాత్రం కానరావడం లేదు. గ్రామాల్లో సర్పంచ్‌లు పటిష్టంగా పనిచేయడంతో పాటు ప్రణాళికలు సిద్ధం చేసేలా అధికారులు కార్యాచరణ సిద్ధం చేయాలి.

# నేర రహిత సమాజమే పోలీస్ అంతిమ లక్ష్యం

- నేర శాతం తగ్గింపుకు పోలీస్ లు కృషి చేయాలి
- సమర్ధవంతమైన పోలీసు వ్యవస్థలో పని చేస్తున్నాం - ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో - జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్






**మహా తెలంగాణ న్యూస్, మహబూబాబాద్ బ్యూరో:** నేర రహిత సమాజమే పోలీస్ అంతిమ లక్ష్యమని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా పోలీస్ అధికారులతో మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సంబంధిత పోలీస్ స్టేషన్ వారీగా నేర నియంత్రణ, కేసుల విచారణ తీరు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను కూలంకషంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి పలు విలువైన సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ డిఎస్పీలు తప్పకుండా తమ పరిధిలో ఉన్న స్టేషన్లను సందర్శించి, వారి పనితీరు సమీక్షించాలని , తమ స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకుని వాటి ప్రకారం నేర నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఇరవై నాలుగు గంటల పెట్రోలింగ్ గస్తీ ఉండాలని అన్నారు. రోజువారీ పెట్రోలింగ్ ను మరింత సమర్ధవంతంగా నిర్వహించాలని, వీలైనంత తక్కువ సమయంలో బాధితుల వద్దకు చేరుకోవాలని సూచించారు. నేరస్తులను పట్టుకోవటంలో, నేరపరిశోధనలో, సాంకేతిక ఆధారాలను మరియు సీసీటీవీ కెమెరాలను ఉపయోగించుకోవాలని అధికారులకు సూచించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలను వెంటాడి పట్టుకోవాలని, పాత నేరస్తుల కదలికల మీద నిఘా వేసి ఉంచాలని, వారు మళ్ళీ నేరాలకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు తమ విధి నిర్వహణలో పారదర్శకంగా, నిజాయితీగా, జవాబుదారీతనంతో ఉండాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకోవటానికి ప్రజలతో మమేకమై పని చేయాలని, విజిబుల్ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, ఫుట్ పెట్రోలింగ్ ను మరింత ముమ్మరంగా చేయాలని సూచించారు. నూతన నేర న్యాయ చట్టాల గురించి అధికారులు, సిబ్బంది సంపూర్ణ పరిజ్ఞానం కలిగి ఉండాలని, చట్టపరిధిలోనే పని చేయాలని, దర్యాప్తు నిబంధనలకు అనుగుణంగా నేర పరిశోధన జరగాలని, గరిష్ట శిక్షా రేటు సాధించేలా కృషి చేయాలని సూచించారు.మహిళా సంరక్షణ కోసం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, షీ టీమ్స్ బృందాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. గంజాయి సరఫరా మరియు వినియోగం మీద ఉక్కుపాదం మోపాలని, యువత మత్తు పదార్థాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, ప్రజలలో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన పోలీస్ సిబ్బందికి ప్రోత్సాహకాలు అందించారు.



# జబర్దస్త్ రాజమౌళికి ఘన సన్మానం



**మహాతెలంగాణ న్యూస్, మహబూబాబాద్ బ్యూరో :** గౌరవ డాక్టరేట్ అందుకున్న జబర్దస్త్ రాజమౌళిని పురప్రముఖులు, అభిమానులు ఘనంగా సన్మానించారు. బుదవారంనాడు స్థానిక పెరుమాండ్ల జగన్నాథం భవన్ లో జర్నలిస్ట్ గుండెల రాజు సారధ్యంలో కొమిరె సాకి అధ్యక్షతన ఈకార్యక్రమం జరిగింది. ముఖ అతిధిగా హాజరైన ప్రముఖ సినీ సంగీత దర్శకుడు బోలెశావలి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన గడ్డం రాజమౌళి సక్సెస్ కు మారుపేరుగా నిలిచారన్నారు. ఎక్కడో మారుమూల జంగిలిగొండ గ్రామం నుండి అంచెలంచెలుగా ఎదిగి వెండితెరపై నవ్వుల జల్లు కురిపిస్తున్న రాజమౌళికి గౌరవ డాక్టరేట్ రావడం ఒక కళాకారునికి దక్కిన అరుదైన గౌరవం అని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ జిల్లా అధికార ప్రతినిధి దేవరం ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ తనజీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మొక్కవోని దీక్షతో వెండితెరపై నటునిగా రాణించడం గొప్పవిషయమన్నారు.నటునిగానే కాకుండా ఎంతోంది నిరుపేదలకు సహాయసహకారాలు అందిస్తూ తన ఉదారతను చాటుకున్న మంచి మనిషి అని ప్రశంసించారు. తన అభినయంతో నవ్వులు పూయించే రాజమౌళి ఎంతోమంది కళాకారులకు స్ఫూర్తిగా నిలిచారన్నాడు. సిపిఎం నాయకుడు సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ గడ్డం రాజమౌళి మానుకోట కళారంగానికే మకుటాయమానంగా నిలిచారన్నాడు. బుల్లితెరనుండి వెండితెరపై తన హాస్య నటనా ప్రావీణ్యంతో మన ప్రాంతానికి గొప్ప పెరు, గుర్తింపు తెచ్చాడన్నారు. సిపిఐ నాయకులు విజయ్ సారధి మాట్లాడుతూ మారుమూల పల్లెనుండి టాలీవుడ్ లో గొప్ప క్యారెక్టర్ ఆర్టిస్టుగా రాణిస్తున్న గడ్డం రాజమౌళికి ముమ్మందు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఉత్తమ నటుని అవార్డు రావాలని ఆకాంక్షించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ డా. పాల్వాయి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జబర్దస్త్ రాజమౌళిని గతంలోనే మున్సిపాలిటీ బ్రాండ్ అంబాసిడర్ గా నియమించుకున్నామన్నాడు. ఎన్నో ప్రజాయుత చైతన్య కార్యక్రమాలు నిర్వహించి రాజమౌళి సందేశం ద్వారా సమాజమార్పుకు నాంది పలికామన్నారు.అనంతరం తెలంగాణ సాంస్కృతిక సారథి రాష్ట్ర అధ్యక్షుడు కొమిరె వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమ ఆద్యంతం ధూండాం పాటలతో హెూరెత్తించారు. స్నేహితులు, అభిమానులు గడ్డం రాజమౌళి దంపతులను గజమాలతో సత్కరించి శాలువాలతో జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా అజయ్ సారధి, శంతన్ రామరాజు, కూతురు సత్యనారాయణ, గిద్దె రాం నర్సయ్య, బండ వెంకన్న, కంబాలాపల్లి సత్యనారాయణ, డా. పరికిపండ్ల అశోక్, జానీ, ఐలేష్ తో కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి రైతును వెన్నాడుతున్న నష్టాలు

**నకిలీ విత్తన విక్రేతలపై చర్యలు శూన్యం**

**గుంటూరు :** మిర్చి రైతు కంట కన్నీరు కారుతోంది. కల్తీ, నకిలీలను సహించేదే లేదన్న ప్రభుత్వ పాలనలో వాటిని అమ్ముకొని రైతులను నిలువునా మోసం చేసిన కంపెనీలపై ఒక్క చర్య కూడా లేదు. కల్తీ మిర్చి నారు అమ్మిన నర్సరీలపై, డీలర్లపై కేసుల్లేవు. కంపెనీల నుండి నష్ట పరిహారం ఇప్పించాలని రైతులు రోడ్డెక్కితే పోలీస్ కేసులే తప్ప రైతులకు ఊరట దక్కలేదు.. కంపెనీలు, నర్సరీల నుండి పరిహారం ఇప్పించే బాధ్యత నుండి ప్రభుత్వం చేతులెత్తేసింది. మిర్చి రైతులు లబోదిబో మంటుండగా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. ఏటా నకిలీ, కల్తీ విత్తనాలు, నారు అమ్మిన వారిపై చర్యల విషయంలో ఇప్పటికీ తగిన విధానం లేకుండా పోయింది. కంపెనీలు, డీలర్ల మెడలు వంచి రైతులకు పరిహారం ఇప్పించాల్సిన సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. నకిలీ కంపెనీలు స్వైర విహారం చేస్తున్నా ఊరూరా నెలకొల్పిన సచివాలయాలు, వలంటీర్లు, రైతుభరోసా కేంద్రాలు, పోలీసులు, విజిలెన్స్, ఇంటెలిజెన్స్ ఏంచేస్తున్నాయో తెలీదు. మిరప పండించిన రైతాంగం ఏటేటా కష్టాల సుడిగుండంలో చిక్కుకుంటోంది. కల్తీ విత్తనాలు, నకిలీ నారు, అంతుబట్టని తెగుళ్లు, అధిక వర్షాలు, వరదలు, మధ్య మధ్య వర్షాభావం కట్టకట్టుకొని ముప్పేట దాడి చేస్తున్నాయి. రైతులకు భారీ నష్టాలు మిగిల్చాయి. అచేతనావస్థలో పడ్డ లక్షలాది మంది రైతులు తమకు ప్రభుత్వమే దిక్కని వాపోతున్నారు. రాష్ట్రంలో సాగయ్యే వాణిజ్య పంటల్లో పత్తి తర్వాత అధిక విస్తీర్ణంలో వేసేది మిర్చినే. ఒక ఎకరాలో మిర్చి సాగుకు కనీసం రూ.లక్ష వరకు పెట్టుబడి అవుతుంది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101